18092024-DIS-04_Layout 1 9/18/2024 1:34 AM Page 1

నమస్తే తెలంగాణ

జమిలి మీమాంస

బీజేపీకి అత్యంత ప్రీతిపాత్రమైన వాటిలో '370 అధికరణం రద్దు', 'ఉమ్మడి పౌరస్మృతి' తో పాటు మరో ముఖ్య అంశం 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'. గత నెల ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో ఈ అంశాన్ని మరోమారు ప్రస్తావించారు. పదే పదే ఎన్నికలు దేశ ప్రగతికి అడ్డుపడుతున్నాయన్నారు. ఆయన ఇలా మాట్లాడటం అదే మొదటిసారి కాదు, గతంలో అనేక సార్లు 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' గురించి ఆయన బలంగా వాదించారు. అంతు లేని ఎన్నికల చక్రభ్రమణంలో నుంచి దేశాన్ని బయటపడేయాలనడం మోదీకి పరిపాటిగా మారింది. బీజేపీ ప్రస్తుత పదవీ కాలంలోనే ఏక కాల ఎన్నికలనే వివాదాస్పద విధానాన్ని ప్రవేశ పెట్టాలనే కృత నిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నదనే సూచనలు వెలువడుతున్నాయి. అయితే, ఇవి నేరుగా అధికారిక ప్రకటన రూపం లో కాకుండా అభిజ్ఞ వర్గాల సమాచార రూపం లో బయటకురావడం గమనార్హం.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్ష తన ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ, గత మార్చి లో సమర్పించిన నివేదికలో 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' భావనను బలంగా సమర్థించింది. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల పాలన పరమైన సుస్థిరత, విధానపరమైన స్పష్టత ఏర్ప డి దేశానికి మేలు కలుగుతుందని ఆ కమిటీ అభి ప్రాయపడింది. ఈ ప్రక్రియ ఓటర్లకు సౌకర్యం గా ఉంటుందని, అనవసరమైన హైరానా తప్పు తుందని, అధిక ఓటింగ్ నమోదుకు అవకాశం ఉంటుందని, దేశంపై ఎన్నికల నిర్వహణ వ్యయ భారం కూడా తగ్గుతుందని కూడా ఆ కమిటీ సూచించింది. పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని, అదేవిధంగా 100 రోజుల లోపు స్థానిక సంస్థల కు ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు చేసింది. ప్రస్తుతం లోక్‌సభకు ఐదేండ్ల కాలవ్యవధితో ఎన్నికలు జరుగుతున్నాయి. కానీ, వివిధ రాష్ట్రా ల్లో అర్ధాంతరంగా శాసనసభల రద్దు, ఇతరేతర కారణాల వల్ల పదే పదే ఎన్నికలు జరపాల్సి వస్తున్నది.

ఏక కాల ఎన్నికల విషయంలో దేశంలో ఏకా భిప్రాయం లేదు. దీన్ని సమర్థించేవారు ఉన్నట్టు గానే వ్యతిరేకించేవారు కూడా బహుళ సంఖ్యలో ఉన్నారు. దీని సమర్థకులు ఎన్నిల వ్యయం తగ్గ డం మొదలుకొని ప్రభుత్వ పరిపాలనా సౌల భ్యం దాకా పలు కారణాలను చూపిస్తుంటారు. ప్రాంతీయ అస్థిత్వాలు, ఆకాంక్షలు వెనుకతట్టు పడతాయని, సమాఖ్యవాదానికి ముప్పు ఏర్ప డుతుందని, లోక్‌సభతో పాటు అసెంబ్లీలకూ ఎన్నికలు జరిపితే జాతీయవాద ఎజెండా ముం దుకువచ్చి రాష్ట్రాల ప్రాధాన్యాలు నిర్ణయాత్మకం కాకుండా పోతాయనేవి వ్యతిరేకుల ప్రధాన అభ్యంతరాలు. జమిలి ఎన్నికలు జరపాలంటే కనీసం ఐదు రాజ్యాంగ సవరణలు అవసరమ వుతాయని, ఇది అంత సులభసాధ్యమైన విష యం కాదని రాజ్యాంగ నిపుణులు అంటున్నా రు. మూడో హయాంలో మైనారిటీలోకి పడిపో యి, మిత్రపక్షాల మద్దతుతో సర్కారును నెట్టు కొస్తున్న ఎన్డీయే ప్రభుత్వం ఇదంతా ఎలా సాధి స్తుందన్నది ప్రశ్న. కానీ, మిత్రపక్షాలైన తెలుగు దేశం, జేడీయూ ఏకకాల ఎన్నికలకు సానుకూ లంగా ఉన్నాయని బీజేపీ వర్గాలు చెప్పుకుంటు న్నాయి. ప్రస్తుతం ఎన్డీయేలో భాగంగా ఉన్న జనతా పరివార్ పార్టీలు జమిలి భావనను సమ ర్థిస్తున్నప్పటికీ డీఎంకే, టీఎంసీ, ఆప్ వంటివి గట్టిగా వ్యతిరేకిస్తుండటం గమనార్హం. 2017లో జరిగిన ఒక సర్వే ప్రకారం లోక్‌సభకు, శాసనస భలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే 77 శాతం మంది ఒకే పార్టీని ఎన్నుకునే అవకాశాలున్నా యని, అలా కాకుండా ఆరు మాసాల తేడాతో జరిగితే వేర్వేరు పార్టీలను ఎన్నుకునే అవకాశా లు పెరుగుతాయని, ఒకే పార్టీని ఎన్నుకునే అవకాశాలు 69 శాతం తగ్గిపోతాయని వెల్ల డైంది. ఈ అంశమే బీజేపీని జమిలి వైపు లాగు తున్నద నే వాదన ఉన్నది. జమిలి వంటి సుదూర పర్యవసానాలు కలిగిన మార్పుల విషయంలో కేం ద్రం ఆచితూచి అడుగువేయా ల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అన్నిపక్షాల అభిప్రాయాలు తీసుకొని, రాజ్యాంగపరమైన, పరిపాలనపరమైన అంశాలను లోతుగా పరిశీ లించిన తర్వాతే దీనిపై ముందడుగు వేయడం శ్రేయస్కరం. కానీ, దుందుడుకు పోకడలకు పేరుగాంచిన మోదీ సర్కారు ఆ మార్గంలో పయనిస్తుందా?

ఒక్క ఏడాదిలోనే ఇట్లా ఉంటే..

టంకశాల అశోక్

మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఒక తినుబండారాల దుకాణానికి వెళ్లాను. అది గోదావరి జిల్లాల వాళ్లది. దాని యజమానికి నేను జర్నలిస్టునని తెలుసు. నన్ను చూడగానే 'ఏం సార్ ఎట్లా ఉంది పరిస్థితి' అన్నాడు. ఆ వెంటనే, 'ఎట్లా ఉంది పరిపాలన' అని అడిగాడు. ఆ రోజుల్లోనే ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, పాడి కౌశిక్‌రెడ్డిల ఉదంతం నడుస్తున్నది. పరిస్థితి ఎట్లా ఉందని ఆయన అడిగింది ఈ ఉదంతం గురించి. పరిపాలన అన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి. జర్నలిస్టులు మాట్లాడించాలి తప్ప తాము మాట్లాడగూడదు గనుక, 'మీరే చెప్పాల'న్నాను. 'గొడవలేవో ఉంటూనే ఉంటాయి. కానీ, ఒక ఎమ్మెల్యే తన మనుషులతో పోయి ఇంకో ఎమ్మెల్యేపైన దాడి చేయటమేంటి సార్. ఇటువంటిది ఎప్పుడూ చూడలేద'న్నాడు. 'కౌశిక్‌రెడ్డి ప్రాంతీయ భేదాలు తెస్తున్నట్టు గాంధీ అంటున్నారు గదా' అని అడిగాను. 'ఏంటి సార్, మేమంతా కేసీఆర్‌ను ఎప్పటినుంచి చూస్తున్నాం. అటువంటిది ఎప్పుడైనా ఉందా' అన్నాడు.

అంతలో మళ్లీ తానే, 'ఈ రేవంత్‌రెడ్డి పరిపాలనేమిటో అర్థం కావడం లేదు. ఏం జరుగుతున్నదో, ఏం జరగటం లేదో తెలియటం లేదు. రియల్ ఎస్టేట్ అయితే అంతా కుప్పకూలింది. మా వాళ్లు చాలామంది మళ్లీ కేసీఆర్ వస్తాడనుకొని 50 కోట్లు, 100 కోట్లు తెచ్చి వ్యాపారాలు మొద లుపెట్టారు. కాంగ్రెస్ రావటంతో గందర గోళం మొదలైంది. ఇప్పుడు ఇదేదో హైడ్రా అని పెట్టారు. దానితో అంతా కుప్పకూలింది. వాళ్లకు ఏం చేయాలో తోచటం లేద'న్నాడు. ఈ మాటలు సాగుతుండగా, దుకాణం బయట కూర్చుని ఉన్న పెద్దాయన ఒకరు లోపలికి వచ్చి, 'ఏంటీ రేవంత్‌రెడ్డి గురించేనా' అని గోదావరి యాసలో అడిగాడు. జవాబు గురించి ఎదురుచూకుండానే 'ఛీ ఛీ ఛీ' అంటూ మళ్లీ బయటకు వెళ్లిపోయాడు. నేను కొనటం పూర్తిచేసి వెళ్తుండగా 'రియల్ ఎస్టేటే కాదు, అన్నీ ఇలాగే ఉన్నాయి. ఒక్క ఏడాదిలోనే ఇలా ఉంటే, ఇంకా నాలుగేండ్లు ఎలా నడుస్తాయి సార్' అన్నాడు.

ఇంటికి వెళ్తుండగా, వెళ్లిన తర్వాత కొంత సేపటి వరకూ ఆ మూడు విషయాల చుట్టూ ఆలోచనలు తిరుగుతూ పోయాయి. ఒకటి, గాంధీ, కౌశిక్‌రెడ్డిల ఉదంతం. రెండు, హైడ్రా. మూడు, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన. వీటిలో మొదటిది ముందుగా చూస్తే, తిను బండారాల దుకాణం యజమాని అన్నట్టు, రాజకీయాలలో గాని, నాయకుల మధ్య గాని గొడవలు ఏవో ఉంటూనే ఉంటాయి. వాటిని వివరంగా తెలుసుకుంటూ, అందులోని తప్పొప్పులపై ఒక అభిప్రాయానికి వచ్చేంత సమయం సాధారణ ప్రజలలో ఎక్కువమం దికి ఉండదు. వారికి తమ పసులు తమకుం టాయి. అయితే, కొన్ని కొండ గుర్తులు మిగి లిపోయాయి. తిరిగి ఆ యజమానే అన్నట్టు, మామూలుగా ఉండే గొడవలు వేరు, ఒక ఎమ్మెల్యే అంతటి మనిషి మరొక ఎమ్మెల్యే ఇంటికి మనుషులతో వెళ్లి దాడి చేయటం వేరు. ఇటువంటి ఘటన తానెన్నడూ చూడ లేదన్నాడాయన. అవును, మనమెవరమూ చూడలేదు కూడా. అందునా అటువంటిది, ప్రశాంతతకు మొత్తం దేశంలోనే పేరుపడిన తెలంగాణలో జరగటం నమ్మశక్యం కానిది. అది అందరినీ దిగ్భ్రమకు గురిచేసింది.

దీనంతటికీ మూలం ఎక్కడుంది, పార్టీ ఫిరాయింపులేమిటి, ఆ సంస్కృతికి 1967 నాటి హర్యానాలో ప్రారంభోత్సవం చేసిందె వరు, తెలంగాణ విషయానికి వస్తే టీఆర్ఎస్ విషయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిందే మిటి, తర్వాత కేసీఆర్ ఏం చేశారు, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన ఏం జరుగుతున్నదనే దంతా ఒక సుదీర్ఘ చర్చ. ప్రజలకు, ప్రజాస్వా మ్యానికి సంబంధించినంత వరకు ఇదంతా ఎప్పుడూ ఉన్నదే. అందుకు సంబంధించిన వాదోపవాదాలు, చట్టాలు, కేసులు, చట్టా లను వంకర టింకరగా తిప్పే చాతుర్యాలు, దీనంతటిలో స్పీకర్లు, గవర్నర్ల పాత్రలు ఒక అంతులేని నీతిరహితమైన కథ వలె నిరం తరం సాగుతున్నవే. ప్రస్తుత సందర్భం లోనూ బీఆర్ఎస్ నుంచి కొన్ని ఫిరాయిం పులు, వాటిపై ఫిర్యాదులు, అవి స్పీకర్‌తో పాటు హైకోర్టు పరిధిలో ఉండటాన్ని ప్రజలు గమనిస్తూ వస్తున్నారు. చివరికి ఏం జరుగు తుందన్నది వారి ఆసక్తి. కానీ, ఇటువంటి సాధారణ స్థాయి పరిణామాల క్రమం కాస్తా, కౌశిక్‌రెడ్డి ఇంటిపై గాంధీ భౌతికదాడితో అక స్మాత్తుగా మరొకస్థాయికి వెళ్లింది.

> **తెలంగాణలో రాజకీయ సంస్కృతి ఈ స్థాయికి పతనం కావటమన్నది మనకు ఆందోళన కలిగిస్తుండటం ఒక విషయం కాగా, ఇది ఈ ఒక్క ఘటనతో ఆగుతుందా, ఇంతకు మించి కూడా మరేమైనా జరగవచ్చునా అన్నవి ఇతర ప్రశ్నలు. కౌశిక్‌రెడ్డిని చంపివేయగలనని గాంధీ కుమారుడు ఇప్పటికే బహిరం గంగా హెచ్చరించినట్లు వార్తలు వెలువడ్డాయి. దాన్ని బట్టి, ప్రశాం తతకు పేరుబడ్డ తెలంగాణ రాజకీ యాల్లో కొత్తగా ఒక ప్రమాదకర దశ రాగలదేమోనని మనం భయ పడాలేమో తెలియటం లేదు.**

హైడ్రా విషయానికి వస్తే, దాని లక్ష్యం చాలా మంచిది. అదే సమయంలో రెండు మాటలు చెప్పాలి. పర్యావరణ పరిరక్షణ అనే కోణం నుంచి అది కీలకమైనది కాగా, దాని అమలుతో ముడిబడిన సామాజిక అంశాల కోణం నుంచి సున్నితమైనది. అటువంట ప్పుడు ఈ రెండింటిని పరిగణనలోకి తీసు కుంటూ ముందుగా చేయవలసిన ఆలోచ నలు, ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనేకం ఉంటాయి. అట్లా చేయనప్పుడు ఒక వైపు అమలులో హైడ్రా సంస్థకు, రెండవ వైపు ప్రజలకు కలిగే అయోమయాలు, అన ర్థాలు అనేకం ఉంటాయి. కానీ, ఇంత భారీ కార్యక్రమాన్ని తలపెట్టినప్పుడు అవసరమైన ముందస్తు ఆలోచనలు, ఏర్పాట్లు జరగకపో వటమన్నది ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అందు వల్లనే ప్రజల నుంచే గాక కోర్టుల నుంచి కూడా మళ్లీ మళ్లీ ప్రశ్నలు, విమర్శలు ఎదుర వుతున్నాయి. పర్యావరణ లక్ష్యం పట్ల మొదట కలిగిన సదభిప్రాయం నెమ్మదిగా మసకబారిపోతున్నది. అయినప్పటికీ ప్రభుత్వం గాని, హైడ్రా గాని తగు సవరణలు చేసుకోకపోవటం తీవ్రమైన అభ్యంతరకర విషయం.

విస్తృతంగా చర్చకు వచ్చినవే అయినా కొన్ని ప్రధాన అంశాలను మరొకమారు పేర్కొందాం. హైడ్రాను తెలంగాణ అంతటా గాక హైదరాబాద్‌లోని ఓఆర్ఆర్‌కు పరి మితం చేయటం ఎందుకనే ప్రశ్నను పక్కన ఉంచుదాం. ప్రస్తుతానికి తీసుకున్న పరిధిలో నైనా ఏమి చేయవలసింది? అన్ని చెరువులు, కుంటలు, నాలాల జాబితా ఏమిటి? వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల సరిహద్దులు ఎక్క డున్నాయి? అందుకు సంబంధించిన మ్యాప్‌లు, ఉపగ్రహ చిత్రాలు? ఆ ప్రకారం నేలపై గుర్తింపులు? మ్యాప్‌లు, ఉపగ్రహ చిత్రాలు వేర్వేరు ప్రభుత్వ శాఖల వద్ద, సంస్థల వద్ద వేర్వేరుగా పరస్పర విరుద్ధంగా గల సందర్భాలు కూడా కనిపిస్తున్నందున వాటిలో దేనిని ప్రామాణికంగా తీసుకోవాలి? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో గల తాత్కాలిక నిర్మాణాలు, శాశ్వత నిర్మాణాలు ఏవి? శాశ్వత నిర్మాణాల స్థలాలకు రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలకు అనుమతులు ఎంతకాలం క్రితం ఇచ్చారు, ఇచ్చిందెవరు? నిర్మాణాల తర్వాత ఇంటి నంబర్, వివిధ కనెక్షన్లు, ఇతర పౌర సదుపాయాలు కల్పించిందెవరు?

వీటన్నింటికి రుసుముల వసూలు ఏ విధంగా ఎవరు చేస్తున్నారు? ఇంకా నిర్మాణ దశలో ఉన్నవి ఏవి? నిర్మాణాలు చేసినవారు వ్యక్తులు, స్వయంగానా లేక బిల్డర్లా? సహ కార గృహ నిర్మాణ సంస్థలా? నిర్మాణమైన తర్వాత ఎవరినుంచి ఎవరికైనా అమ్మకాల ద్వారానో లేక కుటుంబ పంపిణీల వల్లనో చేతులు మారాయా? స్థలాలను ప్రభుత్వాలే ఏవో పథకాల కింద పేదలకు పట్టాలిచ్చినవి ఉన్నాయా? పక్కాగా కబ్జాలు జరిగినవి ఏవి? దీనంతటిలో నాయకుల పాత్ర ఏమిటి? తరచూ ప్రకటిస్తూ వస్తున్న క్రమబద్ధీకరణ పథకాలు వర్తించినవి ఏవి? ఎఫ్‌టీఎల్, బఫ ర్‌జోన్‌లు ఉన్నప్పటికీ వాతావరణ మార్పులు, నీటి పరీవాహకతలో మార్పుల వల్ల దశాబ్దాల కాలంలో ప్రజలు, అధికా రులు గాని గమనించక సహజమైనరీతిలో కుంచించుకుపోయినవి ఏవి? ఇప్పుడు ఉల్లంఘనలను వెనుకకు పోయి గుర్తించే దుకు కటాఫ్ సంవత్సరం ఏమిటి? వీటన్నిం టిని తిరగదోడటం ఎట్లా? దేనిని ఆధారంగా తీసుకొని ఆ పనిచేయాలి? చివరకు ఇవన్నీ సమగ్రంగా తేలి ఒక చిత్రం స్పష్టమైన వెనుక చర్యలు తీసుకునేందుకు ఎట్లా ముందుకు కదలాలి? ఆ విషయంలో చట్టాలు, ఇతరత్రా ప్రభుత్వ నిబంధనలు, గతంలో కోర్టు తీర్పులు ఏం చెప్తున్నాయి?

గమనించదగిన మౌలిక వైఫల్యం ఏమంటే, ఇటువంటి మేధోమథనం ఏమీ జరగలేదు. అంతేకాదు, కూల్చివేతల వల్ల శాశ్వత నివాసాలు కోల్పోయే అమాయక కొనుగోలుదారుల గురించి గాని, తాత్కాలిక నివాసాలు పోగొట్టుకునే పేదల విషయంలో గాని చేయవలసిందేమిటి? ఈ చర్యలన్నింటి ఫలితంగా హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం, ప్రజలు, వ్యాపారాలు, పరిశ్రమలు ఆర్థికంగా దెబ్బతినే అవకాశాలున్నాయా? ఉంటే ఏ విధంగా, ఏ మేరకు? ఆ నష్టాలను ఏ విధంగా వీలైనంత మేరకు పరిమితం చేయాలి? తర్వాత తిరిగి ఏ విధంగా కోలుకో వాలి? అందుకు ఇప్పటినుంచే ఏమి ఏర్పాట్లు చేసుకోవాలి? అనే ఆలోచనలు గాని, వాటినన్నింటిని ప్రజల ముందు పార దర్శకంగా, ప్రజాస్వామికంగా ఉంచటం గాని ఏమీ జరగలేదు.

హైడ్రా అధికారి రంగనాథ్ అరకొర మాటలేవో ఇప్పుడు చెప్తున్నారు. హైడ్రా కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొన్ని వారాల పాటు ఆయన నుంచి ఈ మాత్రపు సంయమనపూరితమైన మాటలు అయినా వినిపించలేదు. పైగా, కోర్టుకు ఎవ రైనా వెళ్తే స్టే వచ్చేలోపల కూల్చేస్తాం తరహా విభ్రాంతికరమైన మాటలు మాట్లాడారు. చివరికి పేదల రేకుల ఇళ్లను సైతం రాత్రి వేళ కూల్చే అత్యుత్సాహానికి పాల్పడ్డారు. ఆ మాటలు చేతలు చూడగా, హాలీవుడ్ సిని మాలలో అశ్వారూఢులై వచ్చి పిస్తోళ్లను తీసి ధాం ధామ్మని పేల్చి మళ్లీ అంతే వేగంగా దూసుకుపోయే పాత్రలు గుర్తుకువచ్చాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార యంత్రాంగం వ్యవహరించదగిన పద్ధతేనా అది? అది కూడా పైన సుప్రీంకోర్టు, ఇక్కడ హైకోర్టూ, బుల్డోజర్ న్యాయాలు తగవని, చట్టవిరుద్ధమని హెచ్చరిస్తుండగా. ఈ తీరు వల్ల రియల్ ఎస్టేట్ కుప్పకూలటం, పేదలే నిరాశ్రయులు కావటం, మధ్య తరగతిలో, పై తరగతిలో, వ్యాపార వర్గాలలో భయాం దోళనలు వ్యాపించటం ఒక్కటైతే, అంత కన్న మౌలికంగా ప్రభుత్వం పట్ల, హైడ్రాతో సహా అధికార యంత్రాంగం పట్ల ప్రజల విశ్వాసం దెబ్బతినిపోతున్నది. కబ్జాదారు లలో భయం సృష్టించటం కూడా తమ లక్ష్యమన్నారు హైడ్రా కమిషనర్. అది మంచి మాటే. కానీ భయం సృష్టి చట్టాల సక్రమమైన అమలు ద్వారా జరగాలి తప్ప, పైన అన్న హాలీవుడ్ సినిమాల తీరులో కాదు. రంగనాథ్‌కు గత రికార్డు వల్ల మంచి పేరు, గౌరవం తగినంత లభించగా, తన మాటలు చేతల తీరు కారణంగా ఇప్పుడది దెబ్బతినటం మొదలైంది. కనుక సంయ మనం చూపించి జాగ్రత్తపడటం మంచిది. అంతకన్న ముఖ్యంగా, సమగ్రమైన సమా చారంతో సంపూర్ణమైన విధి విధానాలు రూపొందించి ఇవ్వవలసిందిగా, వాటిని ప్రజలకు పారదర్శకంగా ప్రకటించవలసిం దిగా ప్రభుత్వాన్ని కోరాలి. లేనిపక్షంలో ప్రభుత్వ వైఫల్యాల దోషం తనకు సైతం చుట్టుకోకతప్పదు.

చివరగా ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఏర్ప డుతున్న అభిప్రాయాలు అనేకం ఉన్నా, వాటి సారాంశాన్ని ఒకే ఒక వాక్యంలో చెప్పు కోవాలంటే, తిరిగి ఆ తినుబండారాల దుకాణం యజమాని నిస్పృహగా, 'ఒక్క ఏడాదిలోనే ఇలా ఉంటే ఇంకా నాలుగేండ్లు ఎలా నడుస్తాయి సార్' అని అడిగినట్టు, పరి స్థితులు అనేక విధాలుగా నానాటికి నిస్పృహ కరంగానే మారుతున్నాయి. ఆ వివరాలు అనే కానేకం అయినందున, అందరూ గమనిస్తు న్నవే గనుక, ఇక్కడ ప్రత్యేకంగా ఏకరవు పెట్టుకోవల్సిన అవసరం లేదు కూడా. ■

తెల్ల కోటు విప్లవానికి కేసీఆర్ నాంది

ఒక దేశం ప్రగతి దిశగా పయనిస్తున్నదా? పతనం వైపు పురోగమిస్తున్నదా? అని తెలుసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రమాణాలున్నాయి. గతంలో ప్రతీ విషయాన్ని ఆర్థిక అంశాలతో ముడిపెట్టి చూసేవారు. కానీ, ఇప్పుడు ప్రగతిని కొలిచే పద్ధతి మారింది. ఎక్కడ మనిషి మంచి విద్య, వైద్యం పొందగలుగుతున్నాడు? తదితర అంశాల ఆధారంగా ఐరాస పలు దేశాలకు రేటింగ్ ఇస్తున్నది. 193 దేశాలున్న ఈ జాబితాలో మనది 134వ స్థానం కావడం శోచనీయం.

తన్నీరు హరీశ్‌రావు

మానవ అభివృద్ధిని పరిగణనలోకి తీసుకు న్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆ దిశగా పాలన ప్రారంభించా రు. తెలంగాణ ప్రజలు అత్యున్నత జీవన ప్రమాణాలతో జీవించాలని ఆయన తపించారు. ఆ తపన లోంచి పుట్టిన కార్యక్రమాలే రెసిడెన్షియల్ స్కూళ్లు, మిషన్ భగీరథ, శాంతిభద్రతల పరిర క్షణ, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపరచడం.

ప్రజా వైద్యాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దితే ఆరోగ్య తెలంగాణను సాధించవచ్చునేది కేసీ ఆర్ భావన. మన దేశంలో ప్రజలకు సరిపడా వైద్యులు, వైద్య కళాశాలలు లేవు. ఉన్న కొన్ని మెడికల్ కాలేజీలు కూడా ప్రైవేటువే. ఆస్ట్రేలి యాలో ప్రతీ వెయ్యి మందికి 5.5, బ్రిటన్‌లో 3.2, అమెరికా, చైనాలో 2.6 మంది డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. కానీ, మన దేశంలో ఒక్కరు మాత్రమే ఉన్నారు. అదీ కూడా ఒక్క అల్లోపతిలో కాదు, వివిధ రంగాల్లో కలిపి ఈ సంఖ్య ఉన్నది. అందుకే, తెలంగాణ ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలందించాలనే సంకల్పంతో 2014లోనే కేసీఆర్ రోడ్‌మ్యాప్ సిద్ధం చేశా రు. తత్ఫలితంగానే నేడు దేశంలో అత్యుత్తమ ప్రజావైద్యం అందుతున్న మొదటి మూడు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది.

ఇక వైద్య కళాశాలల విషయానికి వస్తే.. బీఆర్ఎస్ పదేండ్ల పాలన ఓ స్వర్ణయుగం. దేశంలో మరెక్కడా లేనివిధంగా, కొత్త జిల్లా లను పరిగణనలోకి తీసుకొని జిల్లాకో వైద్య కళాశాలను మంజూరు చేసిన ఘనత కేసీఆ ర్‌ది. తాజాగా 4 వైద్య కళాశాలలకు అనుమతి రావడంతో వాటి సంఖ్య 34కు చేరింది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తెలంగాణ ప్రాంతంలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉం డేవి. ఈ సంఖ్యను పెంచాలని అసెంబ్లీలో, బయటా మేం ఎంత మొత్తుకున్నా ఫలితం లేదు. నాలుగు జిల్లాలున్న రాయలసీమలో నాలుగు మెడికల్ కాలేజీలు, 9 జిల్లాలున్న ఆంధ్రలో 7 మెడికల్ కాలేజీలుండేవి. కానీ, పది జిల్లాలున్న తెలంగాణలో మరో మూణ్నా లుగు మెడికల్ కాలేజీలు పెట్టాలని మొరపెట్టు కున్నా పట్టించుకునే నాథుడు లేడు. తెలం గాణ రాష్ట్రం ఏర్పడటం, దానికి తొలి ముఖ్య మంత్రిగా కేసీఆర్ ఎన్నిక కావడంతో మెడికల్ కాలేజీల కల నెరవేరింది. ఉమ్మడి రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గుర్తించిన కేసీఆర్ కేంద్రం ఏ మాత్రం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతోనే జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పా టుచేశారు. కేంద్రం దేశవ్యాప్తంగా 157 మెడి కల్ కాలేజీలను మంజూరు చేయగా, మనకు ఒక్కటీ ఇవ్వకపోవడం గర్హనీయం.

తెలంగాణ ఏర్పాటుకు ముందు 70 ఏండ్ల లో రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పా టైతే, తొమ్మిదేండ్ల స్వయం పాలనలో 29 మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేస్తూ తెలంగా ణ ప్రభుత్వం దేశంలోనే రికార్డు సృష్టించింది. 2014 నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 850 ఎంబీబీఎస్ సీట్లుండగా, నేడు వాటి సంఖ్య 4,090కి పెరిగింది. ఏటా పది వేల మందికి పైగా డాక్టర్లను తయారుచేసే రాష్ట్రంగా తెలంగాణ తయారైంది. తెలంగాణ చేసిన కృషి ఫలితంగా నేడు దేశంలో జనాభా, వైద్యుల మధ్య నిష్పత్తి తగ్గింది.

మెడికల్ కళాశాలలు మాత్రమే కాదు, వాటికి అనుబంధంగా అన్ని వసతులతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు కూడా అందుబాటులోకి వచ్చాయి. 450-1000 పడకల సామర్థ్యం గల ప్రభుత్వ ఆసు పత్రులు అనేక జిల్లాల్లో ఇప్పటికే నడుస్తున్నా యి. ఈ ఆసుపత్రుల్లో 60-100 మంది వర కు వైద్యులు అందుబాటులో ఉన్నారు. అన్ని రకాల వైద్య సేవలందుతున్నాయి. డయాలసి స్, డయాగ్నస్టిక్, క్యాన్సర్, మదర్ అండ్ చైల్డ్ కేర్ సెంటర్లు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నా యి. ప్రతీ జిల్లా కేంద్రంలోనూ ఇలాంటి ఆసు పత్రి అందుబాటులో ఉండటం వల్ల ఇవాళ తెలంగాణ ప్రజలు వంద కిలోమీటర్ల లోపే మెరుగైన వైద్యాన్ని పొందుతున్నారు. ఇది తెలంగాణ సాధించిన గొప్ప వైద్య విజయం.

> **కేసీఆర్ మంజూరు చేసిన మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్రం నుంచి ఇటీవల అనుమతులు లభించడం సంతోషకరం. యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ సహా గత నెలలో అనుమతి పొందిన ములుగు, నర్సంపేట్, గద్వాల్, నారాయణ పేట్ ప్రాంత ప్రజలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు. దీంతో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ కల సాకారమైంది. ప్రతి జిల్లాలో మెడి కల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది.**

ఈ ఏడాదికి సంబంధించి మొత్తం 8 మెడి కల్ కాలేజీలు ఏర్పాటు కోసం గత కేసీఆర్ ప్రభుత్వం నిధులు, భూ కేటాయింపు, మౌలి క సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతులు జారీచేసింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 8 కాలేజీలకు గాను నాలుగు మెడికల్ కాలేజీలకు మాత్రమే ఎన్ ఎంసీ నుంచి గత నెల అనుమతులు లభించా యి. నిబంధనల ప్రకారం మౌలిక వసతుల ఏర్పాటు, బోధనా సిబ్బంది నియామకంలో ప్రభుత్వం విఫలమైందనే కారణంతో ఎన్ఎం సీ అనుమతులు నిరాకరించింది. జరిగిన తప్పును ఆలస్యంగా గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని మౌలిక వసతులు, బోధన సిబ్బందిని సమకూర్చుకుంటామని అనుమతి కోరుతూ కేంద్రానికి అప్పీల్ చేసింది. దీన్ని పరిశీలించిన కేంద్రం ఆ 4 మెడికల్ కాలేజీలకు అనుమతు లివ్వాలని ఎన్ఎంసీకి మార్గనిర్దేశం చేసింది. దీంతో ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం నాలుగు కాలేజీల్లో 200 సీట్లు ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబా టులోకి రానున్నాయి. కొత్త సీట్లతో కలుపుకొ ని తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల్లోనే మొత్తం సీట్ల సంఖ్య 4,090కు చేరు కున్నది. తొమ్మిదేండ్లలో ఆ సంఖ్యను కేసీఆర్ సర్కార్ 5 రెట్లు పెంచింది. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి ఏటా పదివేల మందికి పైగా డాక్టర్లను తయారుచేసే రాష్ట్రంగా తెలంగాణ ఎదిగింది. ఎంబీబీఎస్ సీట్లలో లక్ష జనాభాకు 22 సీట్లతో దేశంలోనే తొలిస్థానంలో నిలవడం గర్వకారణం. పేద ప్రజల చెంతకే సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడంతో పాటు, మన బిడ్డలు వైద్య విద్య